

సోమశిలలో 7.540 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 7.540 టీఎంసీల నీరు ఉంది. పెన్నార్ డెల్టాకు 200, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.74,060
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.6,633
3 శాతం జీఎస్టీతో	రూ.6,832
నవర (8 గ్రా)	రూ.54,656



నేత్రపర్వం పుష్పయాగం

వేదగిరిపై కొలువైన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వివిధ రకాల సుగంధ పరిమళ పుష్పాలతో యాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించి రిజస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్

నెల్లూరు (దర్గామిట్ట): కనుపర్తిపాడులోని ప్రియదర్శిని కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ పరిశీలించారు. రోజు వారి తనిఖీల్లో భాగంగా ఆదివారం కలెక్టర్ స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించారు. కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్ ఉన్నారు.

కసురుగా సముద్రం



ఇందుకూరుపేట: బంగాళాఖాతంలో తీవ్ర తుఫాన్‌గా మారిన 'రెమాల్' ప్రభావంతో సముద్రంలో అలలు ఎగిసి పడుతున్నాయి. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు మైపాడు తీరం చేరుకున్నారు. మెరైన్ పోలీసులు పర్యాటకులను అప్రమత్తం చేస్తూ తగిన జాగ్రత్తలు చేపట్టారు. ఇప్పటికే మత్స్యకారులు తమ వేట సామగ్రిని సురక్షిత ప్రాంతంలో భద్రపరుచుకున్నారు. తుఫాన్ కారణంగా వాతావరణం కొంత మేర చల్లబడింది.

ఓట్ల లెక్కింపుపై అవగాహన పెంపొందించుకోండి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం. హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విధులు కేటాయించబడిన సిబ్బంది అందరూ శిక్షణ ద్వారా సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని, సమర్థవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ సూచించారు. ఆదివారం నెల్లూరు నగరంలోని డీకేడబ్ల్యూ కళాశాల కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమాల్లో ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. జూన్ 4న కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ కౌంటింగ్ విధులను అప్రమత్తంగా నిర్వహించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలన్నారు. కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, నుడా వీసీ బాపిరెడ్డి, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శర్మద, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఉన్నారు.

నిమ్మ సాగుకు భరోసా

మెట్ట రైతులకు నిమ్మ సాగు ద్వారా భరోసా లభిస్తోంది. నిమ్మ సాగు చేసే రైతుల అభివృద్ధికి ప్రభుత్వం పథకాలను ప్రవేశ పెట్టడం, ప్రధానంగా సకాలంలో వర్షాలు కురిసి దిగుబడి పెరగడంతో రైతులు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కన్నబిడ్డల కంటే మిన్నగా చూసుకున్న నిమ్మ చెట్లు కళ్ల ముందే ఎండిపోవడంతో ఆ చెట్లు నరికేసి వంట చెరుకుగా విక్రయించుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవడంతో నిమ్మకు మంచి రోజులు వచ్చాయి. దీనికి తోడు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతో మళ్లీ నిమ్మతోటలు కళకళలాడుతున్నాయి.

- జిల్లాలో మెట్ట ప్రాంతంలో 20 వేల హెక్టార్లలో సాగు
- గతంలో నిమ్మ చెట్లు నరికి ప్రత్యామ్నాయ పంటలు
- ఈ ప్రభుత్వం హయాంలో నిమ్మ తోటలకు ప్రోత్సాహం
- ప్రతి సీజన్‌లో సకాలంలో వర్షాలతో నిమ్మకు మంచి రోజులు
- సీజన్లో యార్డు నుంచి ప్రతి నిత్యం 20 లోడ్లు ఎగుమతులు

పొదలకూరు: జిల్లాలో నిమ్మ సాగుకు భరోసా లభించింది. నిమ్మ తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం లభిస్తోంది. ఉద్యానశాఖ తోటల పునరుద్ధరణ పథకం కింద ముదురు తోటలను తొలగించి మొక్కలను నాటుకుంటే హెక్టార్‌కు రూ.17,700 అందజేస్తోంది. రైతులు నర్సరీల వద్ద బిల్లులు తీసుకుని ఉద్యానశాఖకు సమర్పిస్తే ఉద్యానాధికారి నాటిన మొక్కలను ఫొటోలు తీసుకుని నివేదికలు అందజేస్తే నగదును మంజూరు చేస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మాత్రం చిన్నా, సన్నకారు రైతులకు నిమ్మ సాగుపై ప్రోత్సాహం లభిస్తోంది. ఎకరాలకు ఏడాదికి రూ.50 వేల వరకు రైతులకు అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు 10 ఎకరాలోపు, ఓసీ, బీసీలకు 5 ఎకరాలోపు నిమ్మసాగు చేసుకుంటే రాయితీలను అందజేస్తున్నారు. సేద్యం ఖర్చులను కూడా ఉపాధి హామీలో పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ జలకళ ద్వారా నిమ్మ తోటల్లో ప్రభుత్వం ఉచితంగా బోర్ల నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం ప్రభుత్వం బోరు, కేసింగ్ పైపు, మోటారు, విద్యుత్ సౌకర్యం మొత్తం కలిపి ఒక్కొక్క రైతుకు రూ.4 లక్షల వరకు ఖర్చు చేసింది. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఈ ప్రాంతంలో కాలువలను తవ్వించడం వల్ల తోటలకు నీటి వసతి పెరిగింది.



పొదలకూరు మండలంలో సాగవుతున్న లేత నిమ్మతోటలు

విస్తరిస్తున్న సాగు విస్తీర్ణం

పొదలకూరులో నిమ్మ మార్కెట్ యార్డు ఉండడంతో కాయలు అమ్ముకోవడం రైతులకు అనుకూలంగా మారింది. రైతులు ఇతర పంటల దిగుబడితో పోల్చి చూసుకుని నిమ్మ సాగే లాభదాయకంగా ఉందంటున్నారు. ధరల్లో ఆటు పోట్లు ఉన్నా నిమ్మకు మినిమం గ్యారెంటీ ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గతంలో నిమ్మ తోటలను నరికి వేసిన రైతులు ఇప్పుడు నిమ్మ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించుకునేందుకు సిద్ధపడుతున్నారు. తొలగించిన తోటల స్థానంలో తిరిగి రైతులు నిమ్మ మొక్కలనే నాటేందుకు ఆసక్తిని చూపుతున్నారు. చాలా మంది రైతులకు నిమ్మ సాగే ప్రధాన పంటగా మారింది. గతంలో తోటలను నరికి వంట చెరుకుగా మార్చిన రైతులు ప్రస్తుతం వందలాది ఎకరాల్లో తోటల పెంపకానికి ప్రయత్నిస్తున్నారు.



యార్డుకు వచ్చిన నిమ్మకాయలు

పొదలకూరు ప్రాంతంలో 3,300 హెక్టార్లలో నిమ్మ సాగు ఉంది.

నిమ్మకు మార్కెట్ డిమాండ్

నిమ్మకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ ఏర్పడడం కూడా రైతులకు కలిసి వస్తోంది.



తోటల్లో జలకళ పథకంలో బోర్లు వేస్తున్న దృశ్యం(ఫైల్)

ఢిల్లీ మార్కెట్ నుంచి విదేశాలకు సైతం నిమ్మ ఎగుమతి జరుగుతోంది. ఉత్తరభారత దేశం నుంచి నిమ్మ పరిశోధనలు జరుపుతున్న శాస్త్రవేత్తలు నిమ్మ మార్కెట్ యార్డుకు రావడమే కాక, తోటలను సైతం పరిశీలించి నిమ్మకు ఉన్న ఔషధ గుణాలతో పాటు, దాని మార్కెట్‌ను ప్రచారం చేస్తున్నారు. నిమ్మ మార్కెట్ విస్తరించి ధరలు పెరుగుతుండడం వల్ల రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. దీంతో వరి సాగును తగ్గించి మెట్ట పంటైనా నిమ్మ పైనే ప్రధానంగా ఆధార పడుతున్నారు. వేసవి కాలంలో రైతులకు గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి.

నిమ్మ మార్కెట్ పెరిగింది



నిమ్మ మార్కెట్ దేశంలో బాగా పెరిగింది. యార్డు నుంచి దేశ వ్యాప్తంగా ఎగుమతులు ఉన్నాయి. ధరల్లో తరచూ వ్యత్యాసం ఉన్నా రైతులకు దాదాపుగా గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో నిమ్మకాయల దిగుబడి ఉన్న రైతులు ఆర్థికంగా బాగా నిలదొక్కుకుంటారు. ప్రస్తుతం ఉన్న ధరలు కూడా తక్కువేమీ కాదు.

– ఎం.బాలకృష్ణారెడ్డి, నిమ్మ మార్కెట్ వ్యాపారి, పొదలకూరు

రైతులకు జగన్ భరోసా



నిమ్మ రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లుగా ఎంతో భరోసా కల్పించారు. చిన్న, సన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేయించడం వల్ల నిమ్మ రైతులకు భరోసా కల్పించినట్టు అయింది. అన్ సీజన్‌లో కూడా గిట్టుబాటు ధర ఉండేలా చేస్తే మంచిది. కోల్డ్ స్టోరేజీలను నిర్మించి కాయలు నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.

ఎ.గంగిరెడ్డి, రైతు, మొగళ్లూరు

సాగు విస్తీర్ణం పెరుగుతోంది



ఈ ప్రాంతంలో ఉద్యాన పంటలు మొత్తం కలిపి 4 వేల హెక్టార్లలో సాగవుతుంటే ఒక్క నిమ్మ 3,300 హెకార్టలో సాగు అవుతోంది. కాయల ధరలు బాగా పెరగడం వల్ల రైతులు నిమ్మ సాగుపై మక్కువ చూపుతున్నారు. ఈ ప్రాంత రైతులతో నిమ్మ సాగు విడదీయలేని బంధంగా ఏర్పడింది. సాగులో ఎంత నష్టం, కష్టం వచ్చినా నిమ్మసాగును వదులుకోరు.

– ఈ ఆనంద్, ఉద్యానాధికారి, పొదలకూరు

మళ్లీ క్లీన్ స్వీప్ చేస్తాం..

- ఎన్నికల నిర్వహణలో యంత్రాంగం ఘోర వైఫల్యం
- పోలీస్ అధికారులను కావాలనే బదిలీ చేశారు
- టీడీపీ కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు
- సోమిరెడ్డి నగదు పంపిణీ విషయంపై హైకోర్టును ఆశ్రయిస్తాం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (పొగతోట): సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ సరళి, శాతాన్ని పరిశీలించాక వైఎస్సార్‌సీపీ మరోసారి క్లీన్ స్వీప్ చేయబోతుందని, నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాలతో పాటు పాత, కొత్త జిల్లాల పరిధిలోని 11 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేకపోయినా ఓపికగా ఎండల్లో నిలబడి ప్రజలు ఓటు హక్కు వినియోగించుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి జైకొట్టారన్నారు. ఆదివారం నెల్లూరు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర స్థాయిలో ఎన్నికల కమిషన్ పక్షపాత ధోరణితో వ్యవహరించిందని అభిప్రాయపడ్డారు. మాచర్లలోని అనేక ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను లాగేసి టీడీపీ కార్యకర్తలు రిగ్గింగ్‌కు పాల్పడితే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోలేదన్నారు. రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించి వైఎస్సార్‌సీపీ వారిని పోలింగ్‌కు రానివ్వకుండా అడ్డుకున్నారన్నారు. టీడీపీ నాయకులు యథేచ్ఛగా రిగ్గింగ్‌కు పాల్పడేలా పోలీసులు సహకరించారన్నారు. ఎన్నికల కమిషన్ వద్ద అత్యంత గోప్యంగా ఉండాల్సిన వీడియో బయటకు వస్తే దానికి మాకు ఎటువంటి సంబంధం లేదు అని ఎస్‌ఈసీ చెప్పాడంటే పోలింగ్ ఏవిధంగా జరిగిందో అర్థమవుతుందన్నారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంలో ఎన్నికల కమిషన్ వైఫల్యం చెందిందని వ్యక్తిగతంగా అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు.

జిల్లాలో పోలింగ్ ఏర్పాట్లు అధ్వానం

జిల్లాలో పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాట్లు చేయడంలో ఎన్నికల అధికార యంత్రాంగం ఘోరంగా వైఫల్యం చెందిందని మంత్రి కాకాణి విమర్శించారు. తాను 1999 నుంచి ఎన్నికల చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా వ్యవహరించారన్నారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా జరగలేదన్నారు. అనేక చోట్ల ఈవీఎంలు మొరాయించాయన్నారు. విద్యుత్ సౌకర్యం, ఎన్నికల సిబ్బందికి సరైన భోజనం, కనీసం మంచినీరు కూడా అందించలేదన్నారు. క్యూలైన్‌ల్లో ఉన్న ఓటర్లు మంచినీరు అడిగితే అందించిన నాయకులపై దాడులు చేశారని విచారం వ్యక్తం చేశారు. జిల్లా యంత్రాంగం చేత కాని తనం వల్ల అర్ధరాత్రి వరకు పోలింగ్ జరగడం, ఉదయం 6 గంటల వరకు వాహనాల కోసం సిబ్బంది ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పక్షపాత ధోరణి

జిల్లాలో టీడీపీ సాగించిన అరాచకాలు, దౌర్జన్యాలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ఆధారాలతో ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి ఓటర్లకు నేరుగా నగదు పంపిణీ చేస్తే ఎన్నికల అధికారి మానవతా దృక్పథంతో నగదు పంపిణీ చేశారంటూ నివేదిక ఇచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఖర్చుల కోసం ఇచ్చిన డబ్బులను పంపిణీ చేశారని సోషల్ మీడియాలో వస్తే కేసులు పెట్టారన్నారు. ఎన్నికల్లో మానవతా దృక్పథంతో నగదు పంపిణీ చేయవచ్చా అని ప్రశ్నించారు. ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

నేటి నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

నెల్లూరు (టౌన్): పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆయా కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి నగరంలోని వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పాలీసెట్ కౌన్సెలింగ్ కో–ఆర్డినేటర్‌గా ప్రభుత్వ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రామ్‌ప్రసాద్ వ్యవహరించనున్నారు. ప్రవేశాలు కోరుకునే విద్యార్థులు తొలుత ప్రాసెసింగ్ రుసుం చెల్లించాల్సి ఉంది. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఫీజు చెల్లించాల్సి ఉంది. రుసుం చెల్లించిన అనంతరం విద్యార్థులు స్థానిక వెంకటేశ్వరపురంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావల్సి ఉంటుంది. విద్యార్థులు ధ్రువ పత్రాల పరిశీలనకు వచ్చే సమయంలో కౌన్సెలింగ్ రుసుం రసీదు, ఏపీ పాలిటెక్నిక్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కులు లిస్టు, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఇన్‌కం సర్టిఫికెట్, అర్హత కలిగిన ఓసీలు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు ఒక సెట్ జెరాక్స్ పత్రాలు తీసుకు రావాల్సి ఉంది. సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు షెడ్యూల్ ప్రకారం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు విద్యార్థులు హాజరుకావాల్సి ఉంది. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత విద్యార్థి మొబైల్ నంబరుకు లాగిన్ ఐడీ వస్తుంది. ఈ లాగిన్ ఐడీతో ఆప్షన్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. మరిన్ని వివరాల కోసం వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లేదా https// appolycet. nic. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

తేదీ	ర్యాంకు	చివరి ర్యాంకు వరకు
27.5.24	1 నుంచి	12,000
28.5.24	12,001 నుంచి	27,000 వరకు
29.5.24	27,001 నుంచి	43,000 వరకు
30.5.24	43,001 నుంచి	59,000 వరకు
31.5.24	59,001 నుంచి	75,000 వరకు
03.6.24	75,001 నుంచి	92,000 వరకు
02.6.24	92,001 నుంచి	1,08,000 వరకు
03.6.24	1,08,001 నుంచి	చివరి ర్యాంకు వరకు

ఏమో.. విమానం ఎగరొచ్చు..

- విజయసాయిరెడ్డి ప్రత్యేక మేనిఫెస్టో ప్రకటనతో ఆశల మోసులు
- విమానాశ్రయం కల సాకారం దిశగా ప్రణాళికతో సిద్ధం
- తరలిరానున్న పరిశ్రమలు, భూముల ధరలకు భారీగా రెక్కలు



జిల్లాలో విమానం ఆశలు మోసులెత్తాయి. దామవరం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి జిల్లా ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని జిల్లాకు ప్రత్యేకంగా రూపొందించిన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. విజయసాయిరెడ్డి గెలుపు ఖాయం కావడం, కేంద్రంలోని అన్ని మంత్రిత్వ శాఖల్లో ఆయనకున్న పరిచయాలతో విమానాశ్రయం కల సాకారం అవుతుందని జిల్లా ప్రజలు విశ్వసిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దగదర్తిలో భూములకు బూమ్ పెరిగింది. కొత్త ప్రభుత్వాలు కొలువుదీరిన తర్వాత విమానాశ్రయ నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి.


కావలి: దగదర్తి మండలం దామవరం వద్ద అంతర్జాతీయ స్థాయి విమానాశ్రయ కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో దగదర్తి విమానాశ్రయం నిర్మాణంపై విస్పష్టంగా ప్రకటన చేశారు. జిల్లా అభివృద్ధి కోసం రాబోయే ఐదేళ్లలో విజయసాయిరెడ్డి ప్రకటించిన ప్రత్యేక మేనిఫెస్టోలో విమానాశ్రయంకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో జిల్లా ప్రజల దశాబ్దన్నర కలను సాకారం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. విజయసాయిరెడ్డి గెలుపు ఖాయం కావడంతో విమానాశ్రయంపై ఆశల మోసులెత్తాయి. దీంతో దగదర్తి ప్రాంతంలో భూములకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది.

కార్గో సేవలతో పాటు మరమ్మతుల విభాగం..

దామవరం వద్ద అంతర్జాతీయ స్థాయి కార్గో సేవల విమానాశ్రయంతో పాటు ఎయిర్ క్రాఫ్టల మరమ్మతుల విభాగం కూడా ప్రారంభించేందుకు అవకాశం ఉండడంతో ఈ ప్రాంతం గణనీయంగా అభివృద్ధి చెందే సూచనలు కనిపిస్తున్నాయి. కార్గో విమానాశ్రయం కారణంగా భారీగా పరిశ్రమలు తరలివచ్చే అవకాశం ఉండడంతో స్థానికంగా విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రోడ్డు, రైలు మార్గాలకు అత్యంత చేరువలో విమానాశ్రయ నిర్మాణానికి, పరిశ్రమల ఏర్పాటుకు వేల ఎకరాల భూములు అందుబాటులో ఉన్న దగదర్తి మండలం దామవరం అనువుగా ఉంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని కావలి నియోజకవర్గ ప్రతిష్ట అంతర్జాతీయ స్థాయిలో వెలుగొందడానికి దోహదపడే అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిపాదించి ఖరారు చేసిన ప్రదేశంలోనే నిర్మించి అంతర్జాతీయ విమానాశ్రయానికి డాక్టర్ వైఎస్సార్ పేరునే పెట్టాలని కూడా ఎమ్మెల్యే సీఎంను కోరారు.

అన్నీ సానుకూల అంశాలే...

చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం 1,323 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. దగదర్తి వద్ద అంతర్జాతీయ స్థాయిలో విమానాశ్రయం నిర్మించడానికి 1379.71 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయి. వస్తు రవాణాలో దేశంలోని న్యూఢిల్లీ, ముంబయి విమానాశ్రయాల తర్వాత మూడోది చెన్నై విమానాశ్రయం. ఏడాదికి 5.5 లక్షల టన్నుల సరుకులు ఎగుమతి దిగుమతులకు వసతులు ఉన్నాయి. 2020 తర్వాత 8 లక్షల టన్నులకు సామర్థ్యాన్ని పెంచుకోవాలని చెన్నై విమానాశ్రయ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ఏడాదికి 4.5 లక్షల టన్నుల సరుకు రవాణా ఎగుమతులు దిగుమతులు అవుతున్నాయి. స్థలభావం వల్ల చెన్నై విమానాశ్రయంలో ఎగుమతి, దిగుమతిదారులు అవస్థలు పడుతున్నారు. 2015 డిసెంబర్‌లో చెన్నై విమానాశ్రయం వరద నీటిలో మునిగిపోవడంతో కొద్ది రోజులు మూసేశారు. దీంతో జాతీయ, అంతర్జాతీయ వస్తు రవాణాదారులు తీవ్రంగా నష్టపోయారు. కార్గో హ్యాండ్లింగ్‌కు (వస్తువులు ఎగుమలు–దిగుమతులు) చెన్నై విమానాశ్రయంలో ఖర్చులు భారీగా ఉండడం కూడా వ్యాపార వర్గాలు ఉసూరుమంటున్నాయి. ఇలాంటి ప్రతికూలత ఉన్న క్రమంలో చెన్నైకు ప్రత్యామ్నాయంగా దగదర్తి వద్ద నిర్మించే ఎయిర్ పోర్టులో కార్గోకు ప్రాధాన్యత ఇస్తూ నిర్మాణాలు చేయాలని నిర్మాణ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. జిల్లాలోని కృష్ణపట్నం పోర్టుల నుంచి కూడా విదేశాలకు కార్గో విమానాల్లో వస్తువులు ఎగుమతి చేయడానికి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు.



విమానాశ్రయ ప్రతిపాదిత భూముల మ్యాప్

కావలి ప్రజల గుండెల్లో సీఎం జగన్‌కు సుస్థిరమైన స్థానం



గత ఎన్నికల ముందు ఓట్లు కోసం చంద్రబాబు శంకుస్థాపన పేరుతో డూప్ షో చేశారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు పట్టించుకోకుండా చివరిలో ఇలా చేయడాన్ని ప్రజలు కూడా నమ్మలేదు. నేను రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నుంచి కావలి నియోజకవర్గంలోని ప్రధానమైన పనుల్లో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించాలని తీవ్రంగా కృషి చేస్తున్నాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, అధికారులను నిరంతరం సంప్రదిస్తూనే ఉన్నాను. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అంతర్జాతీయ విమానాశ్రయం పేరు పెట్టాలని ఇప్పటికే సీఎంను కోరాను. విమానాశ్రయం నిర్మిస్తే కావలి ప్రజల మనస్సుల్లో వైఎస్ జగన్‌కు సుస్థిరమైన స్థానం శాశ్వతంగా ఉండిపోతుంది. ప్రధానంగా ఎంపీ విజయసాయిరెడ్డి ఎన్నికలు పూర్తయి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభమవుతాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో శంషాబాద్ తరహాలో రాష్ట్రానికే తలమానికంగా నిర్మాణం చేపడుతాం. ఎయిర్ క్రాఫ్టల మరమ్మతుల విభాగం కూడా ప్రారంభించేందుకు అవకాశాలు ఉన్నాయి.

– రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కావలి









వేసవి క్రీడా సందడి

నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవి సెలవుల నేపథ్యంలో వివిధ క్రీడాంశాల్లో కోచ్‌లు ఉచితంగా శిక్షణను అందిస్తున్నారు. దీంతో హాకీ, ఆర్చరీ, ఫుట్‌బాల్, బాక్సింగ్, స్విమ్మింగ్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ పొందేందుకు చిన్నారులు స్టేడియానికి తరలివస్తున్నారు. వారితో పాటు పెద్దలు కూడా విచ్చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వ్యాయామాలు చేస్తున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో స్టేడియం సందడిగా కనిపిస్తోంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్లుప్తంగా

53 వాహనాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో కోవూరు పోలీసులు

నెల్లూరు(క్రైమ్): జిల్లా వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ కొనసాగుతోంది. కోవూరు, కావలి రెండో పట్టణం, పొదలకూరు, కొండాపురం, అల్లూరు, కలిగిరి, కొడవలూరు, జలదంకి, సీతారామపురం, చేజర్ల, కందుకూరు పట్టణం, ఉదయగిరి, దుత్తలూరు పోలీసుస్టేషన్‌ల పరిధిలోని సమస్యాత్మక, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను ఆదివారం పోలీసులు జల్లెడ పట్టారు. ఇంటింటికి వెళ్లి అనుమానాస్పద వ్యక్తులపై ఆరాతీశారు. సరైన రికార్డులు లేని 51 బైక్‌లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయా ప్రాంతాల ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల ఓట్ల లెక్కింపు వేళ ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడిన నలుగురికి జరిమానా

నెల్లూరు (వీఆర్సీసెంటర్): విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఇద్దరు ఆక్వా రైతులు, ఇద్దరు గృహ వినియోగదారులకు రూ.3 లక్షలు జరిమానా విధించినట్లు డీపీఈ విజిలెన్స్ విభాగ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోవూరు, నెల్లూరు రూరల్ డివిజన్‌లలో విద్యుత్ చౌర్యంపై డీపీఈ విజిలెన్స్ విభాగ అధికారులు శనివారం రాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అక్రమంగా విద్యుత్ వాడుతున్న ఇద్దరు ఆక్వా రైతులతో పాటు ఇద్దరు గృహ వినియోగదారులను గుర్తించారు. సుమారు రూ.3 లక్షల జరిమానా విధించినట్లు డీపీఈ విభాగం విజిలెన్స్ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యాచకురాలి మృతి

సంగం: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో యాచకురాలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని దువ్వూరు వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..దువ్వూరు వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగిన యాచకురాలు కొద్దిరోజులుగా ఉంటోంది. శనివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. స్థానికుల సమాచారంతో ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బుచ్చిరెడ్డిపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి బలవన్మరణం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వరికుంటపాడు: మండలంలోని విరువూరు గ్రామానికి చెందిన తాళ్ల నాగార్జునరెడ్డి(48) అనే వ్యక్తి గ్రామ సమీపంలోని అటవీప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై కే తిరుపతయ్య తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన నాగార్జునరెడ్డి గత కొంతకాలంగా మద్యానికి బానిసై అతిగా సేవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన రాత్రికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం చుట్టుపక్కల వెతుకుతుండగా ఆంజనేయస్వామి గుడి సమీపంలో అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించగా ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.70
సన్నవి	రూ.35
పండ్లు	రూ.25

శిరస్త్రాణం..శిరోధార్యం

మనిషి దైనందిన జీవితంలో వేగం పెరిగింది. ప్రజలు తమ అవసరాల రీత్యా ద్విచక్ర వాహనాలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో హెల్మెట్‌లు ధరించకుండా ప్రాణాలపైకి కొని తెచ్చుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనచోదకులు..అందులోనూ హెల్మెట్ ధరించక తలకు తీవ్రగాయాలై ప్రాణాలు కోల్పోతున్న వారే అధికంగా ఉండడం దురదృష్టకరం. ద్విచక్ర వాహనచోదకులు నిర్లక్ష్యం వీడి హెల్మెట్‌ను విధిగా ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

నెల్లూరు(క్రైమ్): గతంలో ఇంటికో సైకిల్ ఉండేది. ఆ స్థానాన్ని ద్విచక్ర వాహనాలు ఆక్రమించాయి. యువత ద్విచక్ర వాహనం ఎక్కితే చాలు రయ్‌రయ్ అంటూ దూసుకుపోతున్నారు. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్తూ ప్రమాదాల బారినపడి మృత్యువాత పడుతున్న ఘటనలు అనేకం. మితిమీరిన వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో సూచికలు లేని మలుపుల్లో వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురవతున్నారు.

నిర్లక్ష్యంతోనే..

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సమయంలో ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే వాహనదారుడు నేరుగా రోడ్డుపై పడడం లేదా ఎగిరిపడడం, మరేదైనా వాహనాన్ని, వస్తువును శరీరం బలంగా తాకడం వల్ల అక్కడికక్కడే చనిపోయే ముప్పు ఉంది. ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 75 శాతం తలకు గాయాలై ప్రాణాలు విడిచిన వారే కావడం విశేషం. శిరస్త్రాణం (హెల్మెట్) తలకు భారమని కొందరు..అందానికి అడ్డమని ఇంకొందరు...ఇలా ఎవరెలా భావించినా చిన్నపాటి నిర్లక్ష్యమే నిండుప్రాణాలను తీస్తోంది. అధిక శాతం యువత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రాణాలను కోల్పోతున్నారు. తలకు తీవ్ర గాయాలైతే దాని ప్రభావంతో తలలో రక్తస్రావం, మెదడులోని నరాలు దెబ్బతిని శరవేగంగా బాధితులు మృతి చెందుతున్నారు. ద్విచక్ర వాహనచోదకుడితో పాటు వెనుక కూర్చున్న



ఘటనా స్థలంలోనే మృతి చెందిన రామయ్య(ఫైల్)

వ్యక్తులు సైతం తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దాన్ని పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వాలకు సూచించింది. అయినా శిరస్త్రాణం అమలు నామమాత్రంగానే సాగుతోంది.

నాశిరకంతో నష్టం

ప్రస్తుతం ద్విచక్ర వాహనాల కొనుగోలుకు చాలా మంది ఆలోచిస్తారు. ఎంతో సమాచారం సేకరిస్తారు. అనుభవం ఉన్న వారి సలహాలు తీసుకుంటారు. అవసరమైతే రూ.లక్షలు వెచ్చించేందుకు వెనుకాడరు. అయితే జీవితానికి అత్యంత భద్రత కల్పించే హెల్మెట్ విషయంలో మాత్రం అశ్రద్ధ కనబరుస్తున్నారు. రహదారుల వెంట దొరికే నాసిరకం, తక్కువ ధరకు వచ్చే హెల్మెట్‌లను కొనుగోలు చేస్తున్నారు. ఇవి ప్రమాదాల్లో వాహన చోదకులను రక్షించవని పలు పరిశీలనల్లో తేలింది. హెల్మెట్‌లు నాణ్యమైనవే వాడాలి. బీఐఎస్ స్టాండర్డ్స్ ప్రకారం తయారు చేసిన వాటినే కొనుగోలు చేయాలి. వీటిలో సాగేతత్వం కలిగిన పాలీస్టిరీన్‌ను వినియోగిస్తారు. ఇది కుషన్‌లా ఉపయోగపడుతుంది. ప్రమాదాలు జరిగినపుడు తలకు దెబ్బతగలకుండా కాపాడుతుంది. ప్రమాద తీవ్రతను తగ్గిస్తుంది.

ప్రయోజనాలెన్నో..

హెల్మెట్ ధరించడం వల్ల ఎన్నో ప్రయోజనాలు



హెల్మెట్ ధరించక తలకు తీవ్రగాయమై మృతి చెందిన కిషోర్ (ఫైల్)

ఉన్నాయి. ప్రమాదం జరిగినా తలకు గాయం కాదు. ప్రమాద తీవ్రత పెద్దదైనా మనిషి ప్రాణాన్ని కాపాడుతుంది. కళ్లలో దుమ్ము, ధూళి పడదు. చెవులకు శబ్ద కాలుష్యం తప్పుతుంది.

విధిగా ధరించాలి

ప్రయాణాల్లో హెల్మెట్ ధరించకుండా ఉండడం ప్రాణాంతకంగా మారుతోందన్న విషయాన్ని ద్విచక్ర వాహనచోదకులు గమనించాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు. చోదక సమయంలో తమ కుటుంబ సభ్యులు గురించి ఆలోచించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌ను మానేయాలని, పరిమితికిమించి వేగం, స్నేహితులతో ప్రాణాంతక విన్యాసాలు, ఎదుటి వాహనాలను గమనించక పోవడం వంటి అంశాలే ప్రమాదాలకు కారణం అవుతున్నాయన్న విషయాలను గమనించాలని సూచిస్తున్నారు. ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

హెల్మెట్ ధరించక మృత్యువు ఒడికి..

- ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆర్టీసీ డ్రైవర్ అబ్దుల్ రజాక్(51) ఆత్మకూరుకు బైక్‌పై వెళుతుండగా నారంపేట అడ్డరోడ్డు వద్ద లారీ ఢీకొంది.తలకు తీవ్రగాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- అదే నెలలో జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో వెంకటేష్ అనే యువకుడు మోటార్‌సైకిల్‌పై జాతీయ రహదారిని దాటుతుండగా ఐషర్ వాహనం ఢీకొంది. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఏప్రిల్‌లో నెల్లూరులోని శెట్టిగుంటరోడ్డుకు చెందిన కిషోర్(19) పనినిమిత్తం బైక్‌పై వెళుతూ ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు తీవ్రగాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- గత నెల 14న నెల్లూరులో మితిమీరిన వేగంతో బుల్లెట్ బైక్ ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బేల్దారి కూలీలు రామయ్య(44) తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, తవిటయ్య(60), సీమయ్య (42) తలలకు తీవ్రగాయాలై ఆస్పత్రిలో మృతి చెందారు.
- ఇటీవల నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న స్కూటీని బైక్ వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీపై వెళుతున్న లక్ష్మి(21)తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతి చెందింది. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమయ్యాయి. ద్విచక్ర వాహన చోదకులు శిరాస్త్రాణం ధరించక ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు.

కోడిపందేల స్థావరాలపై దాడి



తోటపల్లిగూడూరు: అదుపులోకి తీసుకున్న పందెంరాయుళ్లతో పోలీసులు

తోటపల్లిగూడూరు: మండలంలోని మండపం పంచాయతీ పరిధిలోని గొల్లపాళెం సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై జంపాని కుమార్ తన సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,460 నగదు, మూడు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మర్రిపాడు: మండలంలోని పొంగూరు పొలాల్లో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.3,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో చోరీ

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లికి చెందిన కడెం సతీష్ అనే వ్యక్తి ఇంట్లో ఆదివారం ఉదయం దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామంలో జరుగుతున్న తిరునాళ్ల వద్దకు సతీష్ తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు ఇంట్లోకి చొరబడి నాలుగు సవర్ల బంగారం, రూ.40వేలు నగదు అపహరించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై విశ్వనాథరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వంగా పుష్పయాగం





లక్ష్మీనృసింహుడికి పుష్పయాగం

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం ఏకాంత సేవ జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా గుంజీ మురళీకృష్ణ, కమల దంపతులు వ్యవహరించారు. ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండ హనుమాన్‌చాలీసా పారాయణం

నెల్లూరు(బృందావనం): నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జూన్ 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం 72 గంటల అఖండ హనుమాన్‌చాలీసా పారాయణానికి శ్రీకారం చుట్టారు. విజయవాడ హనుమత్ దీక్షా పీఠానికి చెందిన భక్తబృందం ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6గంటల వరకు అఖండ హనుమాన్‌చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు శబరి శ్రీరామ క్షేత్రం నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29, 30, 31, జూన్ ఒకటో తేదీ వరకు ప్రతిరోజూ ప్రసన్నాంజనేయస్వామికి విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.



అఖండ హనుమాన్‌చాలీసా పారాయణం చేస్తున్న భక్తబృందం

భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కర్ర తిప్పేస్తాం..

ప్రాచీన యుద్ధకళల్లో కర్రసాము ఒకటి. అంతరించిపోతున్న ఈ సంప్రదాయ కళకు కొందరు జీవం పోస్తూ నేటి తరానికి శిక్షణ ఇస్తున్నారు. దాన్ని కొందరు చిన్నారులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వేసవి సెలవుల్లో ఆట విడుపుగా ఆత్మరక్షణకు దోహదపడే కర్రసాములో శిక్షణ పొందుతున్నారు. ఈ దృశ్యం నగరంలోని చిల్డ్రన్స్‌పార్కులో కనిపించింది. –సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



సిమెంట్ ట్యాంకర్ బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

ఆత్మకూరు: సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి బోల్తా పడడంతో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని ముంబై జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. కడప నుంచి నెల్లూరుకు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ శాంతినగరం–వాశిలి గ్రామాల మధ్యన అదుపుతప్పి జాతీయ రహదారి పక్కనున్న గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ తీవ్ర గాయాలతో క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. స్థానికుల సమాచారంతో ఎస్సై ముత్యాలరావు తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను వెలుపలికి తీసి ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.